క్లుప్తంగా

విజయానందరెడ్డి నామినేషన్ రేపు



చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంసీ విజయానందరెడ్డి గురువారం నామినేషన్ వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటలకు గంగినేని చెరువు సమీపం నుంచి ర్యాలీ ప్రారంభమై గిరింపేట సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు. కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులతో కలిసి వెళ్లి నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నట్లు వివరించారు.

85 ఏళ్లు పైబడిన వారిని గుర్తించండి



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

గుడిపాల: మండలంలో 85 ఏళ్లు నిండిన వారిని గుర్తించి వారందరికీ ఫారం–12డి వారి ఇంటివద్దకే వెళ్లి అందజేయాలని గుడిపాల తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మంగళవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 85 ఏళ్లు నిండిన వారితో పాటు దివ్యాంగులను కూడా గుర్తించాలన్నారు. వారితో మాట్లాడి పోస్టల్ బ్యాలెట్ కావాలా లేకుంటే డైరెక్ట్‌గా ఓటు వేసుకుంటారా అన్న విషయాలను అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రతి బూత్‌లోనూ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని వాటికి సంబంధించిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు.

నవమికి రామాలయం ముస్తాబు

చిత్తూరు రూరల్: నగరం రాములుగుడివీధిలోని శ్రీకోదండరామస్వామి ఆలయం శ్రీరామనవమి పర్వదినానికి ముస్తాబైంది. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల దర్శనార్థం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. ఉదయం అభిషేక పూజలు ప్రారంభించి, గరుడ సేవను వేడుకగా నిర్వహించనున్నారు. గిరింపేట, పొన్నియమ్మగుడి వీధి, టాప్‌లైన్ తదితర ప్రాంతాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేషపూజలతో పాటు సీతారాములు కల్యాణోత్సవాన్ని వైభంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

కుప్పంలో 4 రైళ్ల స్టాపింగ్‌కు అనుమతి

కుప్పం: కుప్పం ప్రజలకు శుభవార్త. దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఇప్పటివరకు స్టాపింగ్ లేని కొన్ని రైళ్లను కుప్పం రైల్వే స్టేషన్‌లో నిలిపేందుకు రైల్వే ఉన్నతాధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అలాగే కుప్పం నుంచి బెంగళూరుకు నడుస్తున్న పుష్‌పుల్‌ను మరో ట్రిప్ నడిపేందుకు అనుమతించారు. వివరాలు..కుప్పంలో కొన్ని రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు రీజినల్ మేనేజర్, డీఆర్‌ఎంలకు ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి గత నెలలో సమస్యలు నివేదించారు. వీరితో పాటు ఎంపీ రెడ్డెప్ప రైల్వే బోర్డు మెంబర్‌గా కుప్పం రైల్వేస్టేషన్‌లో కొన్ని రైళ్లను నిలపాలని రైల్వే బోర్డును కోరారు. ఈ నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారులు స్పందించారు. కుప్పం మీదుగా వెళ్లే దాదర్ ఎక్స్‌ప్రెస్, వాస్కో, చెన్నై మెయిల్, హుబ్లీ రైళ్లకు స్టాపింగ్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పుష్‌పుల్ అదనంగా మరో ట్రిప్ నడిపేందుకు అనుమతించారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏట్టుకూరిపల్లె గ్రామంలో వెలసిన ఎల్లమ్మతల్లికి మంగళవారం గ్రామస్తులు వివిధ అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని ఆలయ అర్చకులు పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం పూజసామగ్రి, సుగంధ పుష్పాలు, పండ్లను గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం



చిత్తపారలో వైద్యసేవలు నిర్వహిస్తున్న దృశ్యం

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ చంద్రమహేష్ అన్నారు. మంగళవారం చిత్తపార గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సంధ్య, చంద్ర, హేమలత, మంజుల పాల్గొన్నారు.

● చంద్రన్న పాలన



నాడు: పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో రాయని బ్లాక్‌బోర్డు

నాడు రాయని బ్లాక్ బోర్డులు..

నేడు స్మార్ట్ బోర్డులు

చిత్తూరు కలెక్టరేట్: గత ప్రభుత్వం సర్కారు బడులను ఏ మాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా సర్కారు బడుల పరిస్థితి మరీ దయనీయంగా ఉండేది. ఆ తరగతి గదిలో ఉండే బ్లాక్‌బోర్డుపై రాయాలంటే అయ్యోర్లకు ముచ్చెమటలు పట్టేవి. ఆ బోర్డులపై ఎంత రాసినా అక్షరాలు మాత్రం విద్యార్థులకు కనిపించేవి కావు. ఇలాంటి తరుణంలో జగనన్న ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కారు బడుల రూపురేఖలు మార్చేసింది. తాము ప్రభుత్వ బడుల్లో చదువుతున్నామంటూ పేద విద్యార్థులు గర్వంగా చెప్పుకునే స్థాయికి వచ్చారు. కార్పొరేట్, ప్రైవేట్ బడుల్లో కూడా లేని విధంగా స్మార్ట్‌బోర్డు(ఐఎఫ్‌బీ ప్యానల్స్), గ్రీన్‌చాక్ బోర్డులను ఏర్పాటు చేశారు. స్మార్ట్‌బోర్డుల ద్వారా సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ విద్యను ప్రభుత్వ బడులకు పరిచయం చేసింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడ్డాయి.

● జగనన్న పాలన



నేడు : పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోర్డుపై విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

గిరాగిరా తిరగాలి ఫ్యానూ..

చిత్తూరు కార్పొరేషన్: ఫ్యాను గుర్తుకు ఓటేద్దాం.. సంక్షేమ పథకాలు తెప్పించుకుందాం.. అంటూ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. గుడిపాల మండలంలో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి ప్రచారం చేయగా, చిత్తూరు నగరంలోని దొడ్డిపల్లె డివిజన్‌లో ఆయన సతీమణి ఇందుమతి, కార్పొరేటర్లు సునీత, శోభ, నాయకులు అంజలిరెడ్డి, ప్రతిమారెడ్డితో కలిసి ప్రచారం చేశారు. ఈ ఐదేళ్లలో జరిగిన మేలును గుర్తు పెట్టుకొని ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గంలో జగనన్న నాయకత్వంలో విజయానందరెడ్డి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని గుర్తు చేశారు. తేనెబండలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు లీనారెడ్డి, కట్టమంచిలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, బాబీ, రామ్మూర్తిరెడ్డి, సంజయ్‌గాంధీనగర్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, కార్పొరేటర్ అజగర్‌బాను, నాయకులు చాన్‌బాషా, సంతపేటలో కార్పొరేటర్ రెడ్డెప్ప నాయకులు ద్వారకా ప్రచారం చేశారు.

ఫ్యాను గుర్తుకే ఓటేద్దాం..

పూతలపట్టు: ఫ్యాను గుర్తుకే ఓటేద్దాం.. జగనన్నను గెలిపించుకుందాం అని పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పూతలపట్టు, వావిల్‌తోట పంచాయతీ పరిధిలో ప్రచారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని కుటుంబాలను సందర్శించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా వారికి అందిన లబ్ధి వివరాలను వివరించారు. అనంతరం గ్రామాల్లో సభలను నిర్వహించి వైఎస్సార్ సీపీ ఐదేళ్లలో చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మహిళలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకురాలు లలిత కుమారి, సర్పంచ్ సంఘ అధ్యక్షులు జయచంద్రా రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, సర్పంచ్ మాసిలా మణి, మహేశ్వరి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, నాయకులు చంద్రా, అమర్‌నాథరెడ్డి, మణి, షణ్ముగం, నాగరాజ, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామి రెడ్డి, జయచంద్రారెడ్డి, మండల పార్టీ యువత అధ్యక్షులు నవీన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుడిపాల: ప్రచారం చేస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి

నేడు వావిల్‌తోటలో ...

వావిల్‌తోట, పాలకూరు పంచాయతీ పరిధిలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు.



పూతలపట్టు: మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

జగనన్న గెలిస్తేనే..సంక్షేమ రాజ్యం

చిత్తూరు రూరల్: జగనన్న గెలిస్తేనే సంక్షేమ రాజ్యం సాధ్యమవుతుందని జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబునాయుడు అన్నారు. చిత్తూరు మండలం గువ్వకల్లు పంచాయతీలో మంగళవారం జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబునాయుడు, మండల నాయకులతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు అందజేసి జగనన్న గెలిపించాలని అభ్యర్థించారు. మండల కన్వీనర్ త్యాగరాజులు, నాయకులు అమరనాథ్‌రెడ్డి, సంపత్, దిలీప్, దేవేంద్రరెడ్డి, మనవాలన్, పాండి, స్టాండిలీ, సుదర్శన్, రాబర్ట్, నాగేంద్ర, ప్రసాద్, సాము, ప్రభాకర్, సుబ్రమణి, జితేంద్ర, ధర్మారెడ్డి, భాస్కర్, పట్టాభి, జయచంద్ర, రమేష్, జ్ఞానశేఖర్, నటరాజ్, రంజన్, పీటర్, పరంధామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



టీ షాపులో టీ వేస్తున్న సునీల్ కుమార్



ప్రచారంలో భాగంగా చొక్కా ఇస్త్రీ చేస్తూ..







దొడ్డిపల్లెలో ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి, తేనబండలో లీనారెడ్డి ప్రచారం, కట్టమంచిలో మనోహర్‌రెడ్డి ప్రచారం, సంజయ్‌గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న కృష్ణారెడ్డి, అజగర్‌బాను, సంతపేటలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ రెడ్డెప్ప

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



వీడియో సమావేశంలో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: కార్పొరేషన్ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీకేష్ బి లత్కర్ చిత్తూరు కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు–తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయం నుంచి కమిషనర్ అరుణ, మునిసిపల్ ఇంజనీరు గోమతి, అధికారులు పాల్గొన్నారు. బోర్లు వినియోగంలో లేకుంటే వెంటనే మరమ్మతులు చేయించాలని, నిర్లక్ష్యం చేయొద్దని ఆదేశించారు. వేడి గాలులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరంలో అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

నామినేషన్ నియమాలను పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి చిన్నయ్య

పూతలపట్టు: నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు తప్పక ఎన్నికల కమిషన్ నియమాలను రిటర్నింగ్ అధికారి చిన్నయ్య పాటించాలని తెలిపారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీకి సంబంధించిన నాయకులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి అభ్యర్థులు వారి నామినేషన్ దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు అందజేయాలని తెలియజేశారు. నిర్ణీత సమయం దాటాక నామినేషన్లు తీసుకోరాదని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల్లోపే ఎంత మంది ఉన్నా అందరి నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు 3 వాహనాలకు మించి రాకూడదని, నామినేషన్ అభ్యర్థితోపాటు మరో నలుగురు మొత్తం ఐదుగురు మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతిస్తారని తెలిపారు. ఎన్నికల నియమావళిని పాటించకపోతే అభ్యర్థులు ఇబ్బంది పడాల్సివస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, సీఐ సుదర్శన్‌ప్రసాద్, డీటీలు మహేశ్వరి, మునికృష్ణ, కవిత, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తత అవసరం

తవణంపల్లె: ఎండలు తీవ్రత పెరుగుతున్నందున వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ వినయ్‌కుమార్ సూచించారు. మండలంలోని దిగువమత్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన 52 మంది రోగులకు వైద్య సేవలందించారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎండలు అధికంగా ఉండడంతో గర్భిణులు ఆరుబయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, తులసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యం అందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

మాకు రక్షణ కల్పించండి

చిత్తూరు రూరల్: మతాంతర వివాహం చేసుకున్న ప్రేమజంట, రక్షణ కల్పించాలంటూ పోలీసులను ఆశ్రయించింది. పెనుమూరు మండలం ఎగువ పూనేపల్లెకు చెందిన మౌలాలి కుమార్తె జాస్మిన్ (23) భర్త తిరుమలేష్‌తో కలసి చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. తవణంపల్లె మండలం చారాలకు చెందిన మురుగేశ్ కుమారుడు తిరుమలేష్, తాను ఐదేళ్లుగా ప్రేమించుకుని, వారం క్రితం పెళ్లి చేసుకున్నట్లు చెప్పారు. మతాలు వేరు కావడంతో కుటుంబసభ్యులు తమ పెళ్లిని అంగీకరించడం లేదని వాపోయారు. కుటుంబసభ్యుల నుంచి తమకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న జంట

ఓటు హక్కుపై అవగాహన



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుడిపాల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇందిరాక్రాంతి వెలుగుసీసీ హేమచంద్రారెడ్డి అన్నారు. వసంతాపురం వీవో ఆధ్వర్యంలో మంగళవారం మహిళా సంఘాల సభ్యుల ద్వారా ఓటుహక్కుపై గ్రామంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు పైబడిన వారి నుంచి ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా ప్రతి ఒక్క ఇంటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి



పనులను పరిశీలిస్తున్న రాజశేఖర్

వెదురుకుప్పం: గ్రామీణ ఉపాధి హామీ కింద ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మయ్యపల్లె, తిరుమలయ్యపల్లె పంచాయతీలలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, స్ట్రక్చర్, సప్లై చానెల్ పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు, సక్రమంగా వేతనాలు చెల్లిస్తున్నారా ? లేదా ? తదితర అంశాలకు సంబంధించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు వంద రోజులు పనులు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి అందరికీ పనులు కల్పించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కుటుంబాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనులు కల్పించడంతో క్షేత్ర సహాయకులు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కూలీలకు అవగాహన కల్పించి పనులు కల్పించే దశలో వెనుకబడిన క్షేత్ర సహాయకులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయన వెంట క్లస్టర్ సహాయక పథక సంచాలకులు శోభన్‌బాబు, ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఓ ఇందు, ఈసీ మునిరత్నం, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకే 'శ్లాస్'

బంగారుపాళ్యం: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకే స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే(శ్లాస్) పరీక్షలని ఎంఈఓ నాగేశ్వర్ రావు అన్నారు. మండలంలో మంగళవారం నిర్వహించిన శ్లాస్ పరీక్షలను ఎంఈఓ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ శ్లాస్ పరీక్షల కోసం మండలంలోని తుంబకుప్పం జెడ్పీహైస్కూల్, బంగారుపాళ్యం ఎంపీపీ స్కూల్, సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల, టేకుమంద జెడ్పీ హైస్కూల్ ఎంపిక చేసినట్లు చెప్పారు. 4వ తరగతి విద్యార్థులు 130 మందికి శ్లాస్ పరీక్షలు నిర్వహించామన్నారు. పై తరగతికి వెళ్లే ముందు కింది తరగతిలో సాధించాల్సిన అభ్యసన ప్రక్రియలను పూర్తి చేస్తున్నారా? లేదా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు విద్యాశాఖ ఏటా ర్యాండమ్‌గా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తోందన్నారు. విద్యార్థుల్లో ఖచ్చితమైన సామర్థ్యాలు తెలుసుకునే ప్రయత్నమే శ్లాస్ ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బంగారుపాళెం ఎంపీపీ స్కూల్‌లో శ్లాస్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ

అరగొండలో శ్రీరామ నవమి వేడుకలు




ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్చకులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం సకల దేవతలను స్వాగతిస్తూ అర్చకులు ధ్వజారోహణాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. 16వ తేదీ నుంచి ఈ నెల 25వ తేదీ వరకు శ్రీరామ నవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలు కొనసాగుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు.

అర్జున తపస్మాన్

పలమనేరు: మండలంలో టి.వడ్డూరులోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా మంగళవారం అర్జున తపస్మాన్ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయం వద్ద గణపతి హోమం, కలశస్థాపక, తపస్మాన్ వద్ద పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వేడుకగా అర్జున తపస్మాన్ నిర్వహించారు. పద్యాలు ఆలపిస్తూ ఒక్కో మెట్టు ఎక్కి, తపస్మాన్ పైకి చేరుకున్న అర్జున వేషధారి విసిరిన నిమ్మకాయలు, పూలు, విబూది పండ్లు మొదలైన దక్కించుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. కార్యక్రమంలో బాలాజీనాయుడు, నాయకులు పాల్గొన్నారు.



తపస్మాన్ వద్ద పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు